# తీక కరెంకెరి

పాలడుగు వెంకటేశ్వరరావు



"ఏరా పుల్లయ్యా! ఎప్పుడొచ్చావు? మీఅమ్మెలా గుంది?" కామందుల ఇంటి ప్రక్కన కూర్చుని కన్నీరు కారుస్తున్న పాలేరు పుల్లయ్యను, ప్రక్కింటి పేరమ్మ పలకరించారు. ఆవిడను చూస్తూనే—

"ఇంకెక్కడమ్మ, అమ్మగారో—మా యమ్మను మట్టిలో కలిపొచ్చేస్తాను" అంటూ భోరున ఏడ్చాడు.

"ఊరుకోరా. ఊరుకో. అంతా ఏదో నాటికి అక్కడికి పోవలసిన వాళ్ళమే. కాస్త ముందూ యెనకా అంతే!" ఓదార్చింది పేరమ్మగారు.

పుల్లయ్యకు ఏడుపు ఆగలేదు. గట్టిగా ఏడుస్తుంటే, అది విని తన కామందురాలు వెంకాయమ్మ గారితో సహా ఇరుగుపొరుగు కూడ పోగయ్యారు.

పుల్లయ్యను చూడగానే వెంకాయమ్మగారు కంగారుగా దగ్గర కెళ్ళి—

"అదేంటి? ఏడుస్తున్నాడే? వీళ్ళమ్మెలా గుంటుంది? ఎప్పుడొచ్చాడమ్మా?" తోటికోడలు పేరమ్మ గార్ని అడిగింది. కామందురాలు గారి మాటలు విన్న పుల్లయ్య ఇంకా పెద్దగా ఏడ్చాడు.

"చచ్చిపోయిందంట. పాపం!"

"ఆ. పాపం. వూరుకోరా పుల్లయ్యా! వూరుకో. ఎంత ఏడిస్తే మాత్రం చచ్చింది తిరిగొస్తాదా యేమన్నానా? ఏవకు. చూసావా అమ్మా, ఎలా చిక్కిపోయాడో! వెళ్ళి నెలైంది. ఎలాగున్నాడో, ఏమైపోయాడో అని మేం కంగారు పడుతున్నాము."

"ఎప్పుడొచ్చాడు?" పుల్లయ్యను ఓదారుస్తూనే అడిగింది.

"ఏమోనే! నేనిలా వచ్చేసరికి ఇక్కడ కూకునే డుత్తున్నాడు."

"పుల్లయ్యా! లెగిసిరా అన్నం తిందుగాని, ఎప్పుడు తిన్నావో యేమో" అంది కామందురాలు.

"పెద్దమ్మగారూ మాయమ్మ..." ముఖానికి గుడ్డ కప్పుకుని గోడకు చేరబడి మళ్ళా గొల్లుమన్నాడు. పిల్లల్ని కన్న కామందురాలి కడుపులో దెబ్బ్యపెట్టి కలిపినట్లే కనుకొనల్లో నీరు తిరిగాయి.

"పోనీలేరా! పడుసుదిగానా—ముసలి పండు. దాని కోసం ఇంత యిద్దై పోతావెందుకు? లెగు అన్నం పెడతాను." కళ్ళు ఒత్తుకుంటు అంది వెంకాయమ్మ గారు.

అంతా తలో ఓదార్పు పలికి పుల్లయ్యను ఓదార్చారు.

కామందురాలు అన్నం మూకుడులో పెట్టి దగ్గర కూర్చుంది. నెల నుండి ఏం తిన్నాడో ఏమో—కడుపు తీరా తింటున్నాడు.

"పెద్దమ్మగారూ! సిన్నమ్మగారేరి?" తింటూనే అడిగాడు వెంకాయమ్మగారి కోడలు గౌరి గురించి.

గౌరి వెంకాయమ్మగారి ఏకైక పుత్రుడు వెంకట్రావు భార్య. ఆమెను చిన్నమ్మగారని పిలుస్తాడు పుల్లయ్య.

"ఇంట్లో వుందిరా పురుడొచ్చింది."

"పురుడొచ్చిందాండి! ఏం పిల్లండమ్మగారూ!?" తింటం మానేసి ఆనందపడిపోతూ అడిగాడు.

"ఆడపిల్ల. నీకింకా తెలీదా?"

"తెలవదండి. సిన్నమ్మగారూ, పాపమ్మగారూ బాగున్నారాండీ?"

"ఆ. బాగున్నారు. ఇంకొంచెం అన్నం వడ్డించనా?"

"ఒద్దండి. మజ్జిగెయ్యండి."

కామందురాలు మజ్జిగ పోస్తూంటే—

"పాపమ్మగారి దెవరి పోలికండి! సిన్నమ్మగారిదా? సిన్నయ్య గారిదాండీ?"

"వాళ్ళ దెవరిదీకాదు. నాది" మురిసిపోతూ అంది.

"నాకు సూపించ రంటండి?" ఆశగ కామందురాలి ముఖంలోకి చూసాడు.

"చూపిస్తాను. తినేసిరా" అని పాత్రలు తీసుకుని లోనకు వెళ్ళింది.

"పుల్లయ్య రెండు జుర్రుల్లో అన్నమంతా జుర్రేసి, మూకుడు కడిగి సాట్లో పెట్టి పెరటి వేపుకు ప్రత్యక్షమయ్యాడు. పెరట్లో జామిచెట్టు క్రింద కూర్చుని ప్రొద్దుటి ఎండలో తల వార్చుకుంటున్న గౌరిని చూసి పరమ సంతోషంతో పలకరించాడు. "సిన్నమ్మగారూ!" అని. గౌరి వెనక్కి తిరిగి చూచి—

"ఎప్పుడొచ్చావురా? పాపం, మీ అమ్మ చచ్చిపోయినందుకు బెంగ పెట్టుకునా అలా చిక్కిపోయావు?" కరుణ ఉట్టిపడేటట్లు అంది గౌరి.

"అంతా నా రాత సిన్నమ్మగారూ! నేను ఎల్లిన మూడురోజులకు సచ్చిపోయింది" పుల్లయ్య మాట పూర్తి గాకుండానే, పాపను పొత్తిళ్ళలో పెట్టి తీసికొస్తూ—

"అది కాదురా మీ అమ్మ, ఇదిగో" అంది, కామందురాలు. ఆ మాటకు పుల్లయ్య ఉలిక్కిపడ్డాడు. కామందురాలి చేతుల్లోని పాపను చూస్తుంటే వాడి కళ్ళు అశ్రుపూరితా లయ్యాయి ఆనందంతో.

"పెద్దమ్మగారూ! పాపమ్మగా రెప్పుడు పుట్టారండి?" కళ్ళు ఒత్తుకుంటు అడిగాడు.

"నువ్వెళ్ళిన మూడోరోజున—ఆదివారం."

"ఆ రోజునే మా అమ్మపోయింది."

"ఆ. అక్కడ చచ్చిపోయి, ఇక్కడ పుట్టిందిరా మీ అమ్మా!" నవ్వుతూ మనుమరాల్ని ముద్దుపెట్టుకుంటు అంది కామందురాలు. నాయనమ్మ ముద్దుకు తట్టుకోలేక "కేర్" మంది పాప.

"అయ్యో! ఏడుత్తున్నారండీ" కంగారు పడ్డాడు పుల్లయ్య.

"కొంచెం పాలియ్యమ్మా, గౌరీ!" అంటు పాపను గౌరికి అందించింది.

"అమ్మగారూ! సినబాబు గారెక్కడి కెల్లారు?"

"పొలం వెళ్లారు. పెదబాబుగారు నీ గురించి కలవరిం చేస్తున్నారు. కర్రి ఆవు నువ్వెళ్ళినప్పట్నుంచీ పాలివ్వటం మానేసింది. గేదె తన్నేస్తుంది. రంగడు సుబ్బణ్ణి గడ్డేస్తుంటే పొడి చేసింది. పాపం వాడు. ఆ పోటుతో రెండురోజులు లెగలేదు. పెయ్యదూడ బెంగెట్టుకున్నట్టుంది. చిక్కిపోయింది. వెళ్ళి కాస్త ఆ దూడల్ని చూడు" వాడు వెళ్ళినప్పటి నుండీ దూడ లేవిధంగా అయ్యింది చెప్పింది కామందురాలు.

"నాకు బాగా అలవాటైపోయాయండి. నాగ డొత్తున్నాడాండీ?" వారి చిన్నపాలేరు గురించి అడిగాడు.

"ఆ చవట వచ్చినా ఒకటే రాకపోయినా ఒకటే. పాల బాగు చేస్తున్నట్లున్నాడు, వెళ్ళి చూడు."

పుల్లయ్య గౌరి ఒళ్లో వున్న పాపను ఒకసారి చూచి సంతోషంగా వెళ్ళిపోయాడు.

పుల్లయ్య రామయ్యగారి పెద్దపాలేరు. సుమారు ముప్పై అయిదు సంవత్సరాలుంటాయి. పొట్టి మనిషి. సొట్టముక్కు, తుట్ట పెదవులు, చీకిరి కళ్లు. అష్టవంకరలూ వాడిలోనే వున్నాయి. ఒక్క తల్లి తప్ప 'నా' అనే వారెవరూలేరు. సర్కారు పుంతలో మూడాకుల గుడిసెలో వుంటున్న తల్లిని మట్టిచేసి, ఆ పాకను దాని ఖర్మానికి దాన్ని వదిలేసి చేతులు దులుపుకుని, ఆ వూరికీ తనకూ శాశ్వతంగా సంబంధం తెంపుకుని వచ్చేశాడ. ఇక వాడి జీవితం రామయ్యగారి పంచనే గడిపెయ్యాలని వాడి నిశ్చయం.

వాడు రామయ్య గారింటికి పాలేరు తనం వచ్చినప్పటి నుండి మంచి లాభాలు కలిగాయని వారి నమ్మకం. వాడ వచ్చేటప్పటికి నాలుగెకరాల భూమి, ఇంకో నాలుగెకరాల కౌవులుదీ—ఒక ఆవు, ఒక గేదె, ఒక గిత్తల జత వుండేవి. వాడు వచ్చిన ఎదు సంవత్సరాల్లోను నాలుగెకరాలల్లా పుట్టినేలై, పొలనిండా పశువులు, ముగ్గురు పాలేర్లు ఇంకా భూమి కొనాలనే ప్రయత్నాలు. అందుకే వాడంటే అందరికీ అంతులేని అభిమానం.

వాడు ఏ పని చేసినా తన సొంత పనిలానే చేస్తాడు. కామందుల ఇంట్లో వాడికి ఏ లోటూ లేదు. 'తొరలో ఎవత్తనన్నా చూచి పీడిక్కట్ట బెట్టెయ్యా'లంటుంటారు రామయ్యగారు. వెంకట్రావు ఒక్కడే సంతానం రామయ్యగార్కి. అతనికి పుల్లయ్యంటే చాల ఇష్టం. వెంకట్రావు బి. ఏ. వరకు చదివి పట్టభద్రుడు గాకపోయినా, ఉద్యోగం చేస్తూ ఒకరి చేతి క్రింద సబార్డినేట్‌గా వుండటం అతనికి ఇష్టం లేక నవీన సాంద్ర వ్యవసాయ పద్ధతులతో వ్యవసాయం చేస్తూ తండ్రికి అండగ నిల్చి మంచి లాభాలు తీస్తున్నాడు. వారికి నాగన్న అనే పన్నెండేళ్ల కుర్రాడు కూడ పాలేరు తనం వున్నాడు. పుల్లయ్య, సుబ్బన్న పొలం పనులు చూస్తుంటే, నాగడు పశువుల్ని మేపుతాడు.

ఒకరోజు ఆన కోకుండ పుల్లయ్యక కబురొచ్చింది. తల్లికి ప్రమాదంగా వుందని. కంటికి కడివెడు నీళ్ళతో కావ ందురాలికి చెప్పాడు తల్లి గురించి. ఆవిడ రామయ్యగారితో చెప్పింది. రామయ్యగారు ఓ పాతిక రూపాయిలిచ్చి, తల్లికి వంచి మందు తీయించి తొరగ బాగు చేయించి పదిరోజుల్లో తిరిగొచ్చెయ్యమనీ, ఇంకా డబ్బు కావలిస్తే కబురు చేయమనీ చెప్పి పంపాడు.

పుల్లయ్య వెళ్ళిన తర్వాత అక్కడేం జరిగిందో ఎవరికీ తెలీదు. ఇంకా వస్తాడని చూస్తుంటే నెల తిరిగిపోయింది. ఏమైపోయాడో అని కంగారు పడ్డారు రామయ్యగారు. ఎంతకీ రాకపోయేసరికి నాలుగైదు రోజుల్లో ఎవర్నన్నా పుల్లయ్య వూరికి పంపాలను కుంటున్నారు. అంతలోనే వచ్చేశాడు.

ఒక్కనెలలేడు పుల్లయ్య వారింట్లో. ఆ ఇంట్లో ఎంతో మార్పొచ్చినట్లనిపించింది వాడికి. గౌరి ప్రసవించింది. కర్రి ఆవుతో సహా పశువులన్నీ చిక్కిపోయినట్లు కనిపించాయి వాడికి. వూరే ఏదో మారి నట్లనిపించిందీ నెలలోనూ.

సాల్లో కెళ్ళి పశువుల్ని చూసుకున్నాడు. సరిగ్గా మేపలేదని నాగన్ని తిట్టాడు. ప్రతీ పశువు దగ్గరకు వెళ్ళి అప్యాయంగా చెయ్యేసి తాకాడు. కోడెదూడ మోరెత్తుకుని వీపు మీద కురిగితే ఒక్కటి చరిచి గంగడోలు గోకాడు. వెనక నుండి కర్రావు గడ్డం నాకింది. పెయ్యదూడ చూచి "అంబా" అని అరిచింది. పెద్దగేదె తల ఆడిస్తూ చెవ్వులు టప టపా కొట్టింది. వాడి మాట విని గిత్తలు, ఎడ్లు అలవల్లో తినే తిండి మానేసి చెవ్వులు రిక్కించి మోరలెత్తి చూసాయి. అన్నిటిని చూసి మళ్ళా కాస్త కాస్త గడ్డేసి పాల అరుగు మీద కూర్చుని చుట్ట వెలిగించుకోబోతున్న పుల్లయ్యకు ఇంట్లో నుంచి పాప ఏడుపు సన్నగ వినిపించింది. నోట్లో పెట్టుకున్న చుట్ట, చేతులోవి పుల్ల అగ్గి పెట్టి అలాగే వుండిపోయాయి. తన్మయత్వంలో పాప ఏడుపు వింటున్న వాడికి కామందురాలన్న మాటలు గుర్తుకొచ్చాయి. "అదికాదురా నీయమ్మ—అక్కడ చచ్చిపోయి ఇక్కడ పుట్టింది.. ఇదిగో!" పుల్లయ్య ముఖంలో ఆనందం చిందులు వేసింది.

అవును. వాడు వెళ్ళిన తర్వాత తల్లి రెండురోజుల వరకు స్పృహలేకుండా వుంది. ఒక వైద్యుణ్ణి తెలికి ఇరవై రూపాయలిచ్చి మందు తీయించాడు. మూడో రోజు కళ్ళు తెరచి తన ముద్దుల కొడుకుని చూచుకుంది. ఆ కుక్కి మంచంలో తన ప్రక్కన కూర్చో బెట్టుకుని ప్రేమగ వాడి ఒళ్ళంత నిమిరింది. "అమ్మా! అమ్మా!!" అని పలకరించాడు ఆనందంతో, "ఊఁ" అంది అతికష్టంగ. ఆ ముసలి తల్లి ఎండిన కళ్ళ నుండి ఎక్కడివో రెండు కన్నీటి బొట్లు బలవంతంగా బైటికొచ్చాయి! అవి ఆనందాశ్రువులుగానేమో నాకు అర్థం గాదు. కాకిపిల్ల కాకికి ముద్దు అన్నట్లు—వికృత రూపుడు పుల్లయ్య ఆ తల్లికి ఎంతో ముద్దు. చెప్పలేనంత ప్రేమ. ఈవి పుల్లల్లా తేలిపోయే చేతులతో వాడ్ని హృదయానికి హత్తుకుంది. ఎండిపోయిన పెదాలతో వాడి బుగ్గల మీద ఎన్నోముద్దులు పెట్టుకుని—

"బా—బా—! పు ల్లి—" పూర్తిగా అనలేకపోయింది.

"ఏందమ్మా" ముఖంలో ముఖం పెట్టి అడిగాడు.

ఆరిపోయే ముందు అధిక కాంతితో వెలుగుతూంది దీపం.

నిశ్చలంగా వాడి ముఖంలోకే చూస్తూ ఆ ముసలి గాజు కళ్ళు శాశ్వితంగా మూసుకుపోయాయి.

అదే రోజున ఇక్కడ గౌరి ప్రసవించింది. ఆడపిల్ల పుట్టింది. తన తల్లే ఈ పిల్ల రూపంలో ఎందుకు పుట్టగూడదు? కామందురాలు గారన్నట్లు తనను విడలేక అక్కడ చచ్చిపోయిన అమ్మ ఇక్కడ తన చిన కామందురాలుగారి కడుపున పుట్టిందేమో! ఎందుకు పుట్టగూడదు? చచ్చి నీ కడుపున పుడతా నంటారుగా ముసలోళ్ళు—

ఏంటేంటో ఆలోచించుకుంటున్న పుల్లయ్య నోట్లో చుట్ట ఎప్పుడు జారి కింద పడిపోయిందో వాడికి తెలీదు. అమ్మ జ్ఞాపకం వస్తే కళ్ళు చెమ్మగిల్లాయ్. అంతలో నాగడొచ్చి "ఒరే పుల్లయ్యా!" అని పిలిచాడు. ఆ పిలుపుతో ఉలిక్కిపడి అగ్గిపుల్ల గీచి నోటి దగ్గర పెట్టుకుంటుంటే "చుట్ట లేకుండ పెదాలంటించుకుంటూ వేంట్రా?" అని వెగటబడి నవ్వాడు నాగడు.

పుల్లయ్య సిగ్గుపడిపోయాడు. క్రిందపడ్డ చుట్ట తీసుకుంటు—"అరి దీని తస్సాదియ్యా! కిందడి పోనాదిరా" అంటూ సొల్లుతో నగం తడిసిపోయిన దాన్నే మళ్ళా నోట్లో పెట్టుకుని అంటించుకుని గబగబా నాలుగ్గుప్పులు లాగి "నాగన్నా! నువ్వు తొరగా దూడల్ని బాడవలోకి తోలుకుపో, నేను కొత్తపంపులో కెళ్తున్నాను. యెదవ సరిగ్గ మేపకుండ అటిటిన్నిటి పాడుసేసావు." అంటు కర్ర చేతపట్టుకుని లేచాడు.

"సెల్లైహె! నాకంటే మేపేవోడెవడో" అంటు కర్ర సహాయంతో కోతిలా ఎగిరి దూకాడు దూడల మధ్యకు నాగడు. తుండు గుడ్డ దులుపుకుని భుజానేసుకుని సణుక్కుంటు సాగిపోయాడు పుల్లయ్య.

* * *

పుల్లయ్య ప్రాణం పాప మీద నిల్పుకున్నాడు. పాపను చూస్తుంటే వాడికి ఏదో చెప్పలేని సంతోషం. అమెను చూస్తూ తనను తానే మర్చిపోతాడు. ముచ్చటగా మూడునెలలు గడిపిన తర్వాత నుండీ మొదలుపెట్టాడు పాపను ఎత్తుకోటం. తీరిక గౌరీ నప్పుడల్లా పాపను ఎత్తుకుని ఆడించటం, వాడు ఆడటం, పాటలు పాడి నిద్రపుచ్చటం. పాప ఏడ్చిందంటే వాడి ప్రాణం గిలగిల లాడిపోతాది. ఏ పని చేస్తున్నా పాప ఏడ్పు విన్నాడంటే అది ఎంత ముఖ్యమైన పనైనా మానేసి నాగస్వరం విన్న నాగుపాములా పరుగున వెళ్ళి ఎత్తుకుని పాటలు పాడి క్షణంలో వూరుకోబెడ్తాడు. వాడి గార్ధభగానంలో ఏం మాధుర్యముందో గాని పాప కూడ వాడి మాటవిన్నా, పాట విన్నా ఏడుపు మాని అలకిస్తుంది. కిలకిల నవ్వి ఆడుకుంటుంది.

ఒకనాటి అర్ధరాత్రి పాప గట్టిగ ఏడుస్తూంది. లేగదూడ అరిచిన అరుపుతో సాల్లో నిద్రపోతున్న పుల్లయ్యకు మెలకువొచ్చింది. పరుగున వెళ్లాడు.

ఎవరూ లేచిన అలికిడి లేదు. అంతా గాఢనిద్రలో వున్నారు.

"సిన్నమ్మగారూ! సిన్నమ్మగారూ!! పాపమ్మగారు లేదుత్తున్నారండీ" తలుపు తట్టాడు. అయినా లేవలేదు. పాప ఇంకా గట్టిగ ఏడుస్తుంది.

"సిన్నమ్మగారూ! సిన్నమ్మగారూ!" అని పిలుస్తూ తలుపు గట్టిగ బాదాడు. కొంతసేపటికి వెంకట్రావు "ఏంట్రా?" అన్నారు లోనుండే.

"పాపమ్మగారు లేదుత్తున్నారండీ, సిన్నమ్మగార్ని లేపండి—" అన్నాడు.

"అర్ధరాత్రప్పుడు నువ్వొచ్చి చిన్నమ్మగార్ని లేపి చెప్పాలా? వెళ్ళవతలకు" చాలా కటువుగ అన్నాడు వెంకట్రావు.

పుల్లయకు ప్రాణం చివుక్కుమంది. అవమానంతో మనసు కృంగిపోయింది. కళ్ళంట నీళ్ళు తిరిగాయి. పాప ఏడుపు వింటుంటే మనసు విలవిలలాడుతుంది. సాలలోకి పోయి పడుకుని గట్టిగ చెవులు మూసుకున్నాడు. పాప తెల్లవార్లూ ఏడుస్తూనే వుంది. వాడికా రాత్రి నిద్రే రాలేదు.


కాలచక్రంలో పన్నెండు నెలలు తిరిగిపోయాయి. పాపకు సంవత్సరం నిండింది. బుల్లిబుల్లి అడుగులు వేస్తూ, మెల్లమెల్లగ మాటలు చెప్పుతూంది. పుల్లయ్యకు పాప తప్ప ఈ లోకంలో మరోటి కనిపించటం లేదు. మూడో నెల నిండినప్పటి నుండే తన చేతులతో నలిపేస్తున్నాడు. పాప తన కామందుల బిడ్డ కాదనీ, తన తల్లే మళ్ళా పుట్టిందనీ వాడి నమ్మకం. "అమ్మా!" అని నోరారా పిల్చుకుంటాడు. అందరితోను, ఆఖరికి రామయ్యగారితోను, వెంకట్రావుతోను "మాయమ్మే మళ్ళా నాకోసం మీ ఇంటిలో పుట్టింది"నే వాడు. వాడి వెర్రి మాటలకు నవ్వుకునే

# మాయమ్మ మళ్ళా పుట్టింది

వారు. పాపకు రామయ్యగారి పేరు కలసి వచ్చేటట్లు "రమణి" అని నామకరణం చేస్తే, పుల్లయ్య తన తల్లి పేరు "సుబ్బమ్మ"ను "సుబ్బాయమ్మ"గ మార్చి పాపను పిల్చుకుని పరమ సంతోషపడిపోతుంటాడు. రమణి కూడ వాడి దగ్గర వున్నంతగ తల్లిదండ్రుల వద్ద, తాత నాయనమ్మల వద్ద కూడ వుండదు. వాడెక్కడికి వెళ్ళిన ఆమెను భుజాన వేసుకునిపోతాడు. దూరంగ తీసుకు వెళ్ళొద్దని ఎంతమంది చెప్పినా వినడు. వాడు క్షణం కనపడకపోతే కలవరించేస్తుంది. అంత ఎదిగ అలవాటు చేసుకున్నాడు తన దగ్గర.

అమ్మలక్కలు పుల్లయ్యను కొడుకు అని పిలవటం నేర్పారు రమణికి. ఎవరైన సర్దాకు "అమ్మా! పుల్లయ్య నీకేమవుతాడే?" అని అడిగితే, వెంటనే "కొడుకు" అని ముద్దుగ అంటుంది. ఆమాట విన్న పుల్లయ్య మైమరచిపోతాడు. పుల్లయ్య అని పిలువటానికి "పుల్ల" అంటుంది. ఆ ముద్దు మాటలన్నీ విని పుల్లయ్య మురిసిపోతూ "నాయమ్మే!! నాయమ్మే!!" అంటు ఎత్తుకుని ఎగిరి గంతులేస్తాడు.

అలవాటు ప్రకారం ఒకరోజున పాపను తీసుకుని ఇంటికి దగ్గర్లో వున్న పొలం తీసికెళ్ళి, పొల దగ్గర దించి ఏదో పని చేసుకుంటున్నాడు. రమణి కొబ్బరి పుచ్చులు ఏరుకుని ఆడుకుంటుంది. ఆడుకుంటు కెవ్వుమని ఏడవటం మొదలెట్టింది. పరుగున వెళ్ళి చూసాడు. కాలు పట్టుకుని రక్తం కారేటట్లు కరిచింది కండచీమ. వాడికి ఏడుపే వచ్చింది. పాపనెత్తుకుని తన కోపం కొద్దీ ఆ చీమను కాలితో గట్టిగ రాచి నలి చేసాడు. ఎన్ని చేసినా రమణి ఏడుపు




మానలేదు. రామయ్యగారు వచ్చి తిట్టారు. వెంకట్రావు కస్సుబుస్సు మన్నాడు. ఏడుస్తున్న పిల్లను భయపడుతూనే ఇంటికి తీసికెళ్ళాడు.

అత్తాకోడళ్ళు కోప్పడ్డారు. అందరి ముందు నేరస్తుడిలా నిలబడ్డాడు పుల్లయ్య. "పాముగాని కరిచిందేమో చూడండి" అన్నారమ్మలక్కలు. చీమే కుట్టింది బాబో అని ప్రమాణంకంచేసి మొర పెట్టుకున్నా ఎవర వినలేదు. ఆరోజు మొదలు పాపను పొలం తీసికెళ్ళటం రద్దుచేసారు.

ఎంతో కాలం తర్వాత మళ్ళా చూచినట్లు పొలాన్నుండి వస్తూనే, చెమటవల్ల ఉప్పుతేరిన ఆ ఒంటితోనే ఎత్తేసుకుంటాడు రమణిని. చుట్ట కాల్చిన ఆ కంపు నోటితోనే ఎన్నో ముద్దులు పెట్టుకుంటాడు. వాడి సర్దా తీరి తిరిగి ఇంట్లోకి పంపిన తర్వాత స్నానం చేయిస్తేనేగాని, పాపకు అంటుకున్న వాడి చెమట, చుట్ట కంపులు ఎవరూ భరించలేరు. అయినా వాడి పిచ్చిప్రేమను కాదని, పాపను ముట్టుకోవద్దని ఇంట్లో ఎవ్వరూ చెప్పలేకపోయేవారు. ఒకవేళ చెప్పినా వారి మాటకు విలువ ఉండదు. వాడ్ని చూస్తూనే రమణి ఎంతమంది అడ్డు చేసిన ఆగకుండ చేతులు చాచుకు వెళ్ళి చంక ఎక్కేస్తుంది. అది కనిపెట్టిన పుల్లయ్య కాస్త శుభ్రంగ వుండటానికి ప్రయత్నిస్తుంటాడు. రోజూ స్నానం చేస్తాడు ఆ రాగి జుట్టుకు నూనె రాస్తాడు. నెలల తరబడి కూడ మార్చని ఆనిక్కరూ, బనీనూ వారంవారం మార్చేస్తున్నాడు. ఈ మార్పంత పాపను ఎత్తుకోటం కోసం.

ఒకరోజు సాయంత్రం నాలుగ్గంటలకు పాప కనపడటం లేదని గొడవచేశారు. వూరంతా వెతికారు. పుల్లయ్య కూడా తీసి కెళ్ళాడనుకోటానికి వాడు తెల్లవారు జామునే లేచి మెరక పొలాన్ని కలుపు, తీయించటానికి వెళ్ళిపోయాడు. పదిగంటలకు వెంకట్రావు సైకిలు మీద వాడికి భోజనం పట్టుకెళ్ళాడు. రామయ్యగారు కోర్టు పని మీద తాలూకా ఆఫీసుకు వెళ్ళారు.

రమణి కనబడకపోయేసరికి అత్తాకోడళ్ళకు సగం ప్రాణాలు పోయాయి. చుట్టుప్రక్కల చెట్లు పుట్లు, నూతులు గోతులు, బావులు కాలవలు వెతికారు. కనిపించలేదు. వెంటనే వెంకట్రావుకి కబురు చేసారు. ఆ కబురు విన్న పుల్లయ్యకు ఒక్కసారిగా గుండె ఆగినట్లైంది. పంటచేలో నుండే పరుగు పెట్టాడు ఇంటికి. నిమిషాల మీద ఇల్లు చేరుకున్న వెంకట్రావు ఇంట్లో వాళ్ళ అజాగ్రత్తకు కోప్పడి తనూ వెతకటం మొదలెట్టాడు. అర్ధగంటలో పుల్లయ్య చేరుకున్నాడు. కామందురాళ్ళు ఇద్దరూ గోలపెట్టి ఏడుస్తున్నారు. వాడికీ దుఃఖం ఆగింది కాదు.

కళ్ళనీళ్ళు తిరిగే పుల్లయ్యకు ఏదో గుర్తుకొచ్చి, పాపను వాడి కూడ తరుచుగ తీసికెళ్ళే దగ్గర తోటలోకి పరుగుపెట్టాడు. తోటలోకి అడుగుపెడుతూనే "పాపమ్మగారూ! అమ్మా! ఓ పాపమ్మగారూ!" అని పిలుస్తూ సాల దగ్గరకు వెళ్ళాడు.

సాల్లో గడ్డిలో నిశ్చలంగ పడి వుంది పాప. చూచి ఉలిక్కిపడ్డాడు. ఒళ్ళు కంపించింది. కళ్ళు బైర్లు గమ్మాయి. ఏంటో భయం—భూమి తలక్రిందు లౌతున్నట్లనిపించింది. కాళ్ళు తేలిపోతున్నాయి



MTP-1-P-1-67

# మాయమ్మ మళ్లా పుట్టింది

పాప ఇకలేదు వాడికి అన్న ఆలోచనతో "పాపమ్మ గారూ!—నాయమ్మా"—కళ్ళు మూసుకుని భోరున ఏడుస్తూ నిలువలేక పడిపోయాడు. పాప ఒంటి మీద వస్తువుల కోసం ఎవరో ఇంత దారుణానికి ఒడిగట్టి వుంటారు. ఆ తల్లిపోతే ఈ తల్లి వుందను కున్నాడు. ఈ తల్లి కూడ పోతే ఇక ఏ తల్లిని చూసి మురిసిపోతాడు. పాపలేంది తను బ్రతికేం చచ్చేం—అనుకుంటు ఏడుస్తున్నాడు.

"పుల్లా! పుల్లా!!" రమణి మెల్లగ లేచి వచ్చి వాణ్ని పట్టుకుంది. ఆ పిలుపుకి, ఆ స్పర్శకి ఉలిక్కి పడ్డాడు. తేరిపార నిజమా, కలా అన్నట్టు చూసాడు.

"పుల్లా! ఏలుతున్నాయే అమ్మ కొట్టిందా?"

తన ఇంద్రియాలనే నమ్మలేకపోయాడు వాడు. అంతులేని ఆనందంతో లేచి —"పాపమ్మగారూ! నాయమ్మా! నాతల్లీ." అంటూ అమాంతం ఎత్తుకుని గుండెలకు అదుముకుని ఎన్ని ముద్దులు పెట్టుకున్నాడో వాడికే తెలీదు. కీడెంచినందుకు విచారించాడు. పరమ సంతోషంతో ఇంటికి పరుగుతీసిన వాడికి బహుమతిగ అంతా తిట్లే యిచ్చారు.

వెంకాయమ్మగారు అందుకుని ఆనందభాష్పాలు రాలుస్తూ ముద్దుల వర్షం కురిపించింది. గౌరి తీసుకుని హృదయానికి హత్తుకుంటూ లోనకు తీసుకుపోయింది.

"ఎక్కడుందిరా?" మనసు కుదుట పర్చుకుని అడిగాడు వెంకట్రావు.

"పాలాన్న పాల్లో గడ్డితో పడుకుని నిద్రపో తున్నారు" అన్నాడు పుల్లయ్య.

"నీకూడ పొలం తీసికెళ్లొద్దని మేం చెప్పితే విన్నావట్రా? ప్రొద్దుట్నుంచీ నీ కోసం కలవరిం చేసింది. అక్కడే వుంటావని వెళ్లినట్లుంది. అయ్యో! కాలవ నిండా నీరు కూడ వుంది. ఏ కాలుజారితే యేముంది! ఎంత గణ్డం తప్పింది! ఒరేయ్ ఈ రోజు మొదలుకుని నువ్వు పిల్లని చేరదియ్యకు. ఎన్ని కళ్ళతో అయినా మేం కాపలా కాయగలం?" చాల కోపంగా అంది కామందురాలు.

'ఇప్పుడు వాణ్ణంటే యేం లాభం. అసలు పాలేరు దగ్గర అంత అలవాటు చేయటమేంటి? పిల్ల మీకు బరువై వాడికి వదిలిపెట్టారు. ఈ వెధవ అమ్మ బొమ్మా అంటు అస్తమానం చంకనేసుకుని తిప్పుతున్నాడు. మరోసారి వీడి దగ్గర పిల్లను చూసా నంటే మీ మర్యాద దక్కదు" కోపంగా అన్నాడు వెంకట్రావు.

"వీడున్నంతకాలం అది వెళ్ళటం మానదు, వీడు చేరదీయటమూ మానడు. అందుకే వీడ్ని పాలేరు తనం మాన్పించెయ్యండి. ఏ గొడవా ఉండదు" అన్నారు వెంకాయమ్మగారు.

పుల్లయ్య మతిపోయినట్లు చూస్తూ నిలబడి పోయాడు.

ఆరాత్రి రామయ్యగారికి అన్ని చెప్పి, పుల్లయ్యను మాన్పించేయటం గురించి ఆలోచించారు. వాణ్ణి మాన్పించడానికి ఆయనకు ఎంతమాత్రం ఇష్టం లేదు. అందుకే వాడికి పాలాన్న మకాం ఏర్పాటు చేసారు.

ఎట్టి పరిస్థితిలోను రమణి పుల్లయ్య కంట

బడటానికి సిల్లేదు. ఆ బ్రతుకే భారం అనిపించింది వాడికి. తన తల్లే తనను విడలేక పాపగ పుట్టిందని భావిస్తున్న పుల్లయ్య, పాపకు దూరంగా అతికష్టంగా రోజులు గడుపుతున్నాడు. వాడిలో మునుపు వున్న ఉత్సాహము, ఆనందము నశించి జీవచ్ఛవంలా వుంటు న్నాడు.

పుల్లయ్య కోసం కలవరించేస్తుంది రమణి. అస్తమానం "పుల్లి కావాలి" అని ఏడుస్తుంది. బెంగ పెట్టుకుని చిక్కి సగమైపోయింది. ఆరోగ్యం చెడిపోయి జ్వరం వచ్చింది. ఆ జ్వరంలో మ్రాగన్నుగ పడి వుండి కూడ "పుల్లా" అని కలవరిస్తుంది. నవ్వుతుంది, ఏడుస్తుంది. పుల్లయ్యకు చెప్పాడు నాగడు. పాలాన్నుండొచ్చి పాపనొక్కసారి చూపించ మని బ్రతిమాడాడందర్నీ, తీవ్రమైన జ్వరంలో వున్న రమణిని తీసుకొచ్చి చూపారు.

కన్నీరు తుడుచుకుంటూ—"అమ్మా!" అన్నాడు.

మ్రాగన్నుగ వున్న పాప ఆ పిలుపు విని ఉలిక్కి పడి అందర్నీ పరికించి చూచింది.

"అమ్మా!" అన్నాడు ఆనందంగ.

"పుల్లా" అంటూ చేతులు చాచి వాడి మీది కురికింది. కామందురాలి చేతుల్లో పాపను అందు కున్నాడు. వాడి భుజం మీద పండుకుని గట్టిగ పట్టు కుంది మళ్ళా వెళ్ళిపోతాడన్న భయంతో కాబోలు. ఆరాత్రంత వాడి భుజమ్మీదే నిద్రపోయింది. తెల్లారే సరికి జ్వరం కొంచెం తగ్గింది. పూర్తిగా తగ్గేవరకు వాడ్ని ఇంటి వద్దనే వుండమన్నా రందరు. వాడి ఆటపాటలతో రెండురోజుల్లో పూర్తిగ తగ్గిపోయింది.

పాపకీ పుల్లయ్యకీ ఈ అవినాభావ సంబంధం ఏమిటో అర్థం గావటంలేదు. వాడు అంటున్నట్లు "అక్కడ చనిపోయిన వాడి తల్లి ఆత్మ వచ్చి వాడ్ని వీడలేక గౌరి గర్భంలో వున్న పాపలో ప్రవేశించిం దేమిటి!?" అన్నారు అంతా. త్వరలో వాడ్ని అవూరు నుండి పొమ్మనకపోతే పిల్ల వారికి దక్కేటట్లు లేదు.

ఇల్లు మారిస్తే ఎట్లా వుంటుందోనని పాపను తీసుకుని పుట్టింటికి వెళ్ళింది గౌరి. వారం తిరక్కుం డానే తీవ్రమైన జ్వరంలో "పుల్లా! పుల్లా!" అని కలవరిస్తున్న పిల్లను తీసుకు వచ్చేసింది. ఆమె జ్వరానికి పుల్లయ్యే మందని అందరికీ తెల్సు. గౌరి వస్తూనే పుల్లయ్య భుజాన వేసింది పాపని. సాయంత్రం వరకు ఆడించి నిద్రపోతున్న పిల్లను కామందురాలికిచ్చి ఎక్కడికో వెళ్ళిపోయాడు.

ఒకగంట తర్వాత పాప మెడలో గొలుసు లేదని గొడవ చేసింది గౌరి. పుల్లయ్య రమణిని ఆడించిన చోట్లన్నీ లైట్లు వేసుకుని వెతికారు. దొరకలేదు. పుల్లయ్యను పిల్చారు. వాడు సాయంత్రం పాపను ఇచ్చేసి ఎక్కడికో వెళ్ళి, ఇంకా రాలేదన్నారు. 'అయితే ఇది వాడి పనే' అని ఏకగ్రీవంగా అన్నారందరు. వాడి మీద అందరికీ కోపం వచ్చింది. వెంకట్రావు కోపం పరిదులు దాటి కారాలు, మిరియాలు నూరుతున్నాడు.

రాత్రి ఎనిమిది గంటలకు మెల్లగ వచ్చాడు. వాడి కోసమే ఎదురు చూస్తున్న వెంకట్రావు—

"పుల్లయ్యా! పాప మెళ్ళోగొలుసు చూసావా?" చాల కోపంగా అన్నాడు. పుల్లయ్య ఆశ్చర్యపోయాడు.

"అసలు పాపమ్మగారి మెళ్ళో గొల్సు లేదు సిన బాబూ"

"నిజం చెప్పు తీసి ఎక్కడ పెట్టావు?" ఉరిమి నట్లుంది కంఠం.

"తల్లి తోడు బాబూ! నేను గొలుస్చూళ్ళేదు." కంగారుగా అన్నాడు.

"చూళ్ళేదూ?" ఒళ్ళు తెలిని కోపంలో వాడి చెంప మీద బలం ద్దీ కొట్టాడు.

రామయ్యగారు గాని, వెంకాయమ్మగారు గాని అడ్డుకోలేదు.

"చెప్పు తీసేంజేసావ్?" మళ్ళా హుంకరించాడు వెంకట్రావు.

"నన్ను సంపెయ్యండి సినబాబూ. నాకా గొలు సుంగత్తెలీదు. అమ్మమెళ్ళో గొల్సు తీసే దొంగను కాదు." ఏడుస్తూనే అన్నాడు.

"నీ నీతులకేం లేరాచెప్పు. ఏం చేసావా గొల్సు?"

"నేను తియ్యలేదు."

"అయితే అప్పుడు పోయి ఇప్పుడొచ్చావు. ఇంత సేపు ఎక్కడికి పోయావ్?"

"అమ్మ మందు కోసం డాక్టరుగా రుపుడే వచ్చారు" వెక్కివెక్కి ఏడుస్తూనే నిక్కరు జేబులో నుండి మందు పొట్లాలు తీసి అరుగు మీద పెట్టాడు.

"ఇదో వంక. నిన్ను ఇలా వదిలితేకాదు. ఒరే నాగా లైటు తీసుకో. వీణ్ణి పోలీసు స్టేషన్లో అప్పగిస్తే వాళ్ళే తేలుస్తారు." నాగడితో అన్నాడు. నాగడు ఒక్క ఉరుకున లేచాడు.

"పోలీస్టేషనూ వద్దు ఏమీ వద్దు. బాబూ! నువ్వు ఇంట్లో కెళ్ళిపో నేను తెల్సుకుంట ను" కొడు కుతో అంది వెంకాయమ్మగారు. వెంకట్రావు తన గదిలోకి వెళ్ళాడు. పుల్లయ్య కామందురాలి దగ్గరకు వెళ్ళి—

"పెద్దమ్మగారో నేనా గొల్సు తియ్యలేదు" దుఃఖం పెల్లుదికింది.

"సోనీలేరా. మా సొమ్మైతే వుంటుంది, మాది కాకపోతే పోద్ది." ఆమె మాటల్లోని అర్థాన్ని గ్రహిం చాడు.

"ఆ మందులు పాపమ్మగారికి పాలతో ఎయ్య మన్నారు." అని చెప్పి వెనక్కి తిరిగాడు.

"మళ్ళా ఎక్కడికిరా. అన్నం తినెళ్ళు" అంది కామందురాలు.

"ఒద్దండమ్మా" అంటూ పాల దగ్గరకు వెళ్ళి పోయాడు.

పూరంతా మాటు మణిగింది. రామయ్యగారు అరుగు మీద పడక్కుర్చీలో కూర్చుని చుట్ట కాల్చు కుంటున్నారు. పుల్లయ్య మెల్లిగా ఆయన దగ్గరకి వెళ్ళి—

"పెదబాబుగారూ" అన్నాడు.

"ఏరా పుల్లయ్యా?" అన్నారు.

"నాకు సెలవిప్పిచ్చండి."

"ఏంట్రంటున్నావు?"

"సెలవిత్తే ఎళ్ళిపోతాను."

"ఎక్కడికి?"

"ఏమో బాబూ. ఎలా గొచ్చానో అలాగే యెళ్ళి పోతాను."

"ఎందుకనీ? చినబాబు అలా చేసాడనేనా?"

"కాదండి. అప్పుడెవరైన అలాగే సేత్తారు."

"మరెందు కెళ్ళిపోతా నంటున్నావు?"

"ఏమో తెలవదండి. ఎళ్ళిపోవాలనుంది."

"పాపను, మమ్మల్ని విడిచి పోతావా?" పుల్లయ్య మాట్లాడలేదు.

"పోయి పడుకో. పిచ్చాలోచనలు ఆలోచించకు." అన్నారు రామయ్యగారు.

"బాబుగారూ! మీ పాదాలు పట్టి సెప్పుతున్నాను గొల్సు నేను తియ్యలేదు." కామందు పాదాలు తాకి వెనక్కితిరిగి పాల దగ్గరకు వెళ్ళిపోయాడు. వాడి ప్రవర్తనకు చలించారాయన.

వాడి మీద రామయ్యగార్కి అనుమానంలేదు. ఐదు సంవత్సరాలుగా వాడి మంచితనం ఆయనకు తెల్సు. వందలిచ్చి ఎరువులు తెమ్మనీ, పన్నులు కట్టి రమ్మని చెప్పినప్పుడు ఒక్కపైసా కూడ తేడా రాకుండా లెక్కలు చెప్పాడు.ఆగొల్సు వందో, ఏభయ్యో వుంటుంది. అది తీసేసుకున్నాడంటే ఆయనకు నమ్మకంలేదు. అందులోనూ వాడు వచ్చినప్పటి నుండి రామయ్యగార్కి ఎనలేని లాభాలు కలిగాయని ఆయన నమ్మకం. వాడు వెళ్ళిపోతే ఏం నష్టాలు కలుగుతాయో, పాప వాడి కోసం బెంగ పెట్టుకుని ఏమైపోతుందో అన్న భయాలతో, వాడు వెళ్ళిపోతానన్నా ఆయన అంగీకరించలేదు. ఆ రాత్రంత వాడి గురించే ఆలో చించారు.

తెల్లవారు జామున విద్దట్లోనే "పుల్లా" అంటూ కెవ్వుమంది రమణి. ఎంత వూరుకోబెట్టిన వూరుకో లేదు. రామయ్యగారు పుల్లయ్యను తీసుకు రావ టానికి పాల దగ్గరకు వెళ్ళి పక్కపై వాడు లేకపోటం చూసి తెల్లబోయారు. వార్ని విడిచిపోయాడని తెల్సు కుని నవనాడులు కృంగిపోయి అక్కడే కూర్చుండి పోయారు రామయ్యగారు.

తెల్లవారేసరికి గౌరి తమ్ముడు సైకిలు మీద వచ్చాడు. ఏమీ తోచక పాల దగ్గరే కూర్చుండి పోయిన రామయ్యగారు చూచి—

"ఇంత ప్రొద్దున్నే వచ్చావేం? అంతా బాగు న్నారా?" అని అడిగారు.

"పాప కెలా వుందో చూచి రమ్మనీ మా అక్క అక్కడ మర్చిపోయి వచ్చిన పాప గొల్సు ఇచ్చి రమ్మనీ మా అమ్మ పంపిందండి." అన్నాడు.

రామయ్యగార్కి తల తిరిగిపోయింది.

"ఆ గొల్సట్టు కెళ్లి మీ బావ మొఖాన్నేసికొట్టు" కోపంగా అంటూ లేచి, కర్ర చేతపట్టుకుని అనాలో చనగా ఎటో వెళ్తున్నారు. గౌరి తమ్ముడు ఆ గొల్సు పట్టుకుని బావ దగ్గరకు వెళ్ళాడు.

ఊళ్ళో వారంత "పాపం పుల్లయ్యెళ్ళి పోయాడు—" అనుకున్నారు. ●

